సీనియర్ బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్టు మేనేజర్‌గా సుధాకర్



గర్మిళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో ఈ నెల 20 నుంచి 24 వరకు జరగనున్న సీనియర్ నేషనల్స్ మెన్ అండ్ ఉమెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు మేనేజర్‌గా పుల్లూరి సుధాకర్ నియమితులయ్యారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పుల్లెల గోపిచంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పుల్లూరి సుధాకర్ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. సుధాకర్‌ను అసోసియేషన్ బాధ్యులు గాజుల ముకేష్‌గౌడ్, బాస్కర్ల వాసు,మీనా రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, కృష్ణ అభినందించారు.

నవోదయ కోసం స్థల పరిశీలన



నెన్నెల రైతువేదిక వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో హరికృష్ణ, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి

నెన్నెల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయానికి భవన నిర్మాణం కోసం మండల కేంద్రంలోని రైతువేదిక వెనుక స్థలాన్ని కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. గురువారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ స్థలాన్ని పరిశీలించారు. విద్యాలయానికి స్థలం అనుకూలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 25 ఎకరాల భూమిని గుర్తించామని అధికారులు పేర్కొన్నారు.

కామన్ మెనూపై స్పష్టత ఏదీ..?



- హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచిన ప్రభుత్వం
- విద్యార్థులకు ఎంత ఇవ్వాలన్నది స్పష్టత కరువు
- మార్కెట్ ధరలతో పోల్చితే మెనూ కష్టసాధ్యమే

మంచిర్యాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లోని విద్యార్థుల మెస్ చార్జీలు పెంచిన ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి కామన్ మెనూ ఎంత ఇవ్వాలనే అంశాన్ని విస్మరించింది. నిత్యావసర సరుకులు, కూరగాయలు, కోడిగుడ్లు, చికెన్, మాంసానికి అనుగుణంగా 40 శాతం మెస్ చార్జీలను, 200 శాతం వరకు కాస్మొటిక్ చార్జీలను పెంచడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపట్టినప్పటికీ ప్రకటించిన ధరల ప్రకారం మెనూ అమలు కష్టసాధ్యమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పెరిగిన చార్జీలు ఇలా...

3 నుంచి 7వ తరగతి చదివే విద్యార్థులకు ఇప్పటి వరకు నెలకు రూ.950 ఇస్తుండగా, ప్రస్తుతం రూ.1330కి పెంచారు. 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు రూ.1100 నుంచి రూ.1540కు పెంచారు. ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు రూ.1500 నుంచి రూ.2100కు పెంచారు. కాస్మొటిక్ చార్జీలను బాలికలకు 7వ తరగతి వరకు రూ.55 నుంచి రూ.175 వరకు, 11 సంవత్సరాల వయస్సు పైబడిన బాలికలకు రూ.75 నుంచి రూ.275కు పెంచారు. బాలురకు 7వ తరగతి వరకు రూ.62 నుంచి రూ.150కి, 11 సంవత్సరాల వయస్సు పైబడిన బాలురకు రూ.62 నుంచి రూ.200 వరకు పెంచారు. మెనూచార్జీలకు అనుగుణంగా ప్రభుత్వం రూపొందించిన న్యూ కామన్ డైట్ మెనూను వివిధ గురుకుల విద్యాలయాల్లో ఇటీవల ఆయా శాఖల అధికారులు ప్రారంభించారు. వాస్తవానికి ఎనిమిది సంవత్సరాలుగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెరగక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఐదేళ్లలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, కిరాణ సరుకులు రెండు, మూడింతలు పెరిగినా విద్యార్థులకు ఇచ్చే మెస్ చార్జీలు పెరగలేదు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం లభించక ఇబ్బందులు తప్పలేదు.

గురుకులాల సంఖ్య పెరిగినప్పటికీ....

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి వరకు ఉన్న గురుకుల విద్యాలయాల సంఖ్యను పెంచింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు చొప్పున బీసీ గురుకులాలు, ఒక మైనార్టీ, రెండు ఎస్సీ గురుకుల విద్యాలయాలను మంజూరు చేసింది. వీటితో పాటు సాధారణ వసతి గృహాలు, కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, సాయంత్రం స్నాక్స్, పాలు, టీ అందజేసేందుకు మెస్ చార్జీలతోపాటు రూపాయికే కిలో బియ్యం సరఫరా చేసింది. 3 నుంచి 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.950, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1100, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదువుతున్న విద్యార్థులకు నెలకు రూ.1500 అందజేశారు.

మిగతా 7వ పేజీలో

అమృత్ 2.0 పథకంతో మున్సిపాలిటీల అభివృద్ధి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 పథకంతో జిల్లాలోని మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ సమగ్ర మాస్టర్ ప్లాన్‌కు చేపట్టిన ఏరియల్ సర్వేను జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంచిర్యాల మున్సిపాలిటీ ప్రాంతంలో నివాస, వాణిజ్య, వ్యవసాయ భూముల గుర్తింపు, అభివృద్ధికి డ్రోన్ ద్వారా ఏరియల్ సర్వే చేపట్టినట్లు చెప్పారు. నివేదిక అందిన అనంతరం మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు ఉన్నందున డ్రోన్ ఏరియల్ సర్వే ద్వారా భూముల సమాచారం సేకరిస్తామని చెప్పారు. జడ్పీ సీఈవో గణపతి, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, జిల్లా యువజనులు, క్రీడల అభివృద్ధి అధికారి కీర్తి రాజ్‌వీరు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడలతో జీవితంలోనూ రాణింపు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే జీవితంలోనూ రాణిస్తారని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సీఎం కప్-2024 క్రీడల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో చెస్ ఆటను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుందని, మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్య, ఉపాధి రంగాలలో రాణించేందుకు ఏకాగ్రత ఏర్పడుతుందన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడాస్ఫూర్తితో ముందుకుసాగాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఈ నెల 27 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కీర్తి రాజ్‌వీరు, జిల్లా షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన సీఎండీ

మందమర్రిరూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఊరు మందమర్రిలోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా సరఫరా చేసేందుకు ప్లాన్‌ను రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ రాంటెంకి గులాబ్, ఏడీ ఈ రాజ్‌కుమార్, ఎంఆర్‌టీ ఏడీ రాజేష్, ఏఈ వేముల మౌనిక, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

ముందుకు సాగని సమీకృత మార్కెట్ పనులు

పట్టించుకోని అధికారులు, నాయకులు

పట్టణవాసులకు తప్పని ఇబ్బందులు

6



ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ భవనం

అధ్యయన కేంద్రంగా కవ్వాల్ అభయారణ్యం

తరలివస్తున్న విద్యార్థులు, పర్యాటకులు

పక్షులు, జంతువులు, వృక్షాలకు నిలయం కవ్వాల్ టైగర్ రిజర్వు



అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

7

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేత

తాండూర్,డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపల్లెవాడ పరిధిలోని శ్రీరామ జిన్నింగు మిల్లులో ఈ నెల 20 నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు సెక్రెటరీ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించాలని సూచించారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ వినతి



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్, కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి/నెన్నెల/తాండూరు/వేమనపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్‌లతో కలిసి నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం హైదరాబాదులో వినతిపత్రం అందజేశారు. నెన్నెల మండలం కోనంపేటకు బీటీ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రారంభమైన రోడ్డు పనులను అనుమతులు లేవనే నెపంతో ఫారెస్టు వారు అడ్డుకున్నారని పేర్కొన్నారు. మండలానికి ఒక జూనియర్ కళాశాల మంజూరయ్యేలా చూడాలని సీఎంకు విన్నవించారు. అనంతరం అటవీశాఖ మంత్రి కొండా సురేఖను కలిసి కోనంపేట రోడ్డు సమస్య, రవాణా సౌకర్యం లేక ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులపై వివరించారు. సీఎం, మంత్రి సానుకూలంగా స్పందించారని మండల నాయకులు తెలిపారు. నాయకులు కారుకూరి రాంచందర్, నర్సింగరావు, ఎండి ఇస్సాక్, సిరంగి శంకర్, సంతోష్, లక్ష్మీనారాయణ, జక్కుల శ్రీధర్, నెన్నెల మాజీ సర్పంచ్ తోట సుజాతశ్రీనివాస్, చీర్ల కిషన్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని తాం డూరు మండల నాయకులు కలిశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డికి నామినేటెడ్ పోస్టు ఇవ్వాలని విన్నవించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ పాల్గొన్నారు.

వేమనపల్లి మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని హైద్రాబాద్‌లో కలిసి మండలంలోని సమస్యలను విన్నవించారు. మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, మల్లంపేట నుంచి నీల్వాయి, కల్లెంపల్లి నుంచి మొట్లగూడెం వరకు రోడ్డు కోసం అటవీ అనుమతులు ఇవ్వాలని, మామడ,కొత్తగూడం గ్రామాలకు ఇండ్లు కేటాయించాలని విన్నవించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న బెబ్బులి



- మంచిర్యాల, కుమరం భీం జిల్లాల్లో పులి సంచారం
- భయాందోళనలో గ్రామస్థులు

మంచిర్యాల/హాజీపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో బెబ్బులి హడలెత్తిస్తోంది. పాత మంచిర్యాల అటవీ సెక్షన్ పరిధిలోని పాత మంచిర్యాల, ముల్కల్ల బీట్‌లోని అడవిలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు ధ్రువీకరించారు. ప్రజలు, పశువుల కాపర్లు, అడవిలోకి వెళ్లవద్దని, విద్యుత్ వైర్లు అమర్చవద్దని సూచించారు. పత్తి ఏరడానికి వెళ్లే కూలీలు గుంపులుగా వెళ్లాలన్నారు. క్వారీ గుట్టల్లో ఏర్పాటు చేసిన సఫారీ రోడ్డుపై పులి సంచరిస్తుండగా బుధవారం ట్రాకింగ్ కెమెరాకు చిక్కింది. ఇటీవల మగ పులి హాజీపూర్ మండలంలో సంచరించగా ప్రస్తుతం కెమెరాకు చిక్కినది ఆడపులిగా అధికారులు పేర్కొన్నారు. పాద ముద్రలు పరిశీలించిన అధికారులు పెద్దపులివిగా నిర్ధారించారు. పులి సంచారంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎఫ్ఆర్‌వో సుభాష్ మాట్లాడుతూ ప్రజలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒంటరిగా అడవి సమీపంలోకి, పత్తిచేన్లలోకి వెళ్లవద్దని సూచించారు. సెక్షన్ అధికారి అతహుల్లా, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

గుండాయిపేటలో పులి సంచారం

కౌటాల, (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండాయిపేట పరిధి వార్దా నది పరివాహక ప్రాంతంలో గురువారం పులి సంచరించింది. గుండాయిపేటకు చెందిన రైతు నవీన్ మిర్చి తోట వద్దకు వెళ్లగా పులి కన్పించడంతో కేకలు వేస్తూ తోటి రైతులను అప్రమత్తం చేశాడు. ఆ ప్రాంతంలోని రైతులు బిగ్గరగా కేకలు వేశారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.



కౌటాల మండలం గుండాయిపేటలో పులి అడుగులను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

అటవీశాఖ అధికారులు పులి అడుగులను గుర్తించారు. ఎఫ్‌డీవో వినయ్ కుమార్ సాహూ ఆధ్వర్యంలో సిబ్బంది పులి అడుగుల ద్వారా ఏ వైపు వెళ్లిందనే విషయాన్ని గుర్తించేందుకు యత్నిస్తున్నారు. పత్తి ఏరేందుకు కూలీలు గుంపులుగా వెళ్లాలని అధికారులు చెబుతున్నారు. ఉదయం 10 గంటల తర్వాతనే చేలలోకి వెళ్లాలని, సాయంత్రం నాలుగు గంటల లోపు ఇళ్లలోకి చేరుకోవాలని సూచించారు. ఈ పులి మహారాష్ట్రలోని చెప్రాడ అభయారణ్యం నుంచి వచ్చినట్లు చెబుతున్నారు. మహారాష్ట్ర ప్రాంతంలో కూడా పులి అడుగులు గుర్తించినట్లు సమాచారం. నది పరివాహక ప్రాంతాలైన తాటిపెల్లి, పార్డి, సాండ్‌గాం, వీర్ధండి, గుండాయిపేట, తుమ్మిహేట్టి ప్రాంతాల్లో పులి తిరిగే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు ప్రకటించారు. దీంతో కౌటాల ఎస్సై మధుకర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో చాటింపు వేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా

నస్పూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు గురువారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ అధికారికి అందజేశారు. యూనియన్ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, జిల్లా కార్యదర్శి రఫీయాలు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కోడిగుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. ప్రతి స్కూల్‌కు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమాతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలన్నారు. వయస్సు పైబడి కార్మికులకు పదవీ విరమణ బెనిఫిట్స్ రూ.3 లక్షలు చెల్లించాలని, భోజన పథకంను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకూడదన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు కరీంబీ, సీఐటీయూ నాయకులు రమణ, ప్రకాష్, రంజిత్ కుమార్, జయరావు, లక్ష్మన్, దూలం శ్రీనివాస్, రాజేశం కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

కలెక్టరేట్ ఎదుట రెండో ఏఎన్ఎంల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

నస్పూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్ళుగా పని చేస్తున్న తమకు రాత పరీక్ష పెట్టాలన్నా విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో రెండో ఏఎన్ఎంలు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రెండు రోజుల నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం రాత్రి 7 గంటల వరకు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ నెల 29న నిర్వహించే ఎంపీహెచ్ఏ రాత పరీక్షను నిలిపివేయాలని నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఈసీ, ఆర్‌సీఎం, హెచ్‌ఆర్‌డి, అర్బన్, అవుట్ సోర్సింగ్ వివిధ స్కీముల్లో 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్నామన్నారు. 45 నుంచి 50 సంవత్సరాల వయస్సుపైబడిన వారు పోటీ పరీక్ష రాసే పరిస్థితి లేదన్నారు. తమకు ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలన్నారు. సత్యవతి, స్వరూప, సుగుణ పాల్గొన్నారు.

జీపీఎస్ విధానాన్ని విరమించాలి

అంగన్‌వాడీ ఉద్యోగులకు జీపీఎస్ యాప్ ద్వారా రోజు ఫొటోలు పెట్టాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారికి వినతిపత్రం అందించారు. యూనియన్ అధ్యక్షురాలు భానుమతి, సీఐటీయూ నాయకులు రమణ, రంజిత్, ప్రకాష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పద్మావతి, సంధ్యారాణి, సునిత, శారధ, చంద్రకళ, సబితా, అనురాధ, శ్రీలత, అదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

నస్పూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం పదో రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట చెట్టు కొమ్మల్లా 18 విభాగాలుగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. చెట్టు రూపంలో ముగ్గు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎస్ఏ-జేఏసీ జిల్లా అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్న, ఉద్యోగులు జనార్దన్, మూర్తి, శ్రీనివాస్, సుమనా, సింధూర, దేవేంద్ర, రాంబాబు, శంకర్, ఆసీస్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట చెట్టు బొమ్మ వేసి నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

పేకాటరాయుళ్ల అరెస్ట్

కానీపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరిపేట గ్రామ శివారు చెట్ల పొదల్లో పేకాట స్థావరంపై గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ. 7,650 నగదును స్వాధీనం చేసుకోగా, మరో ఐదుగురు పారిపోయారని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై లచ్చన్నలు తెలిపారు. పోలీసులకు అప్పగించామన్నారు.

నేడు జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో జూనియర్ విభాగంలో బాలబాలికలకు జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపికకి పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ధర్మరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు బాలికలు ఈనెల 22 నుంచి 25 వరకు మేడ్చల్ జిల్లా స్పోర్ట్ స్కూల్ ప్రాంగణంలో, బాలురు 27 నుంచి 30 వరకు జనగాంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పా ల్గొంటారని ఆయన తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

రెబ్బెన, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల సమస్యలతో పాటు కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని సెంట్రల్ ఐఎన్‌టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరి ఎస్ ప్రకాష్ రావు అన్నారు. గురువారం బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీని సందర్శించారు. అనంతరం కార్మికులతోఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దసరా కానుకగా కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల బోనస్ ఇప్పించామని చెప్పారు. భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్మికులు విధలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గట్టయ్య, కె.శ్రీకాంత్, రాజన్న, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలి



సంతకాల సేకరణలో పాల్గొన్న నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. గురువారం బస్టాండ్ ప్రాంతంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఆర్థికపరమైన రిజర్వేషన్‌లు చెల్లవని సుప్రీంకోర్టు 1993లో తీర్పు ఇచ్చిందన్నారు. అయినా కేంద్రం 2019లో పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను అగ్రవర్ణాలకు అందించడం బీసీలకు అన్యాయం చేయడమేనని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను రద్దు చేయాలని లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. సమితి అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి అక్కల రమేష్, గౌరవాధ్యక్షులు కర్రె లచ్చన్న, నాయకులు భీమ్‌సేన్, రాజన్న, చారి, సతీష్, సల్మాన్, గట్టయ్యవెంకటేష్ పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే విద్యాలయాన్ని పరిశీలించిన డీఈవో



పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈవో యాదయ్య

తాండూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ పాఠశాల, కళాశాలను గురువారం డీఈవో యాదయ్య సందర్శించారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న గదుల సంఖ్య, మరుగుదొడ్లు, స్నానపు గదులు, కిచెన్ షెడ్ పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను తనిఖీ చేశారు. అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలను తాండూర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహానికి తరలించే అవకాశాలను పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఎంఈవో మల్లేశం, సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, పాఠశాల ఇన్‌చార్జ్‌ప్రిన్సిపాల్ మంజుల, ఉన్నారు.

మాలమహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

బెల్లంపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా తెలంగాణ మాలమహానాడు నాయకులను పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల గోపి, నాయకులు బందెల మురళీ, సుభాస్, రాజేశం, అరుణ్‌లు ఉన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తే సహించేది లేదని చెన్నూరు నియోజకవర్గ మాల సంఘం నాయకుడు శీలం వెంకటేశం పేర్కొన్నారు. అసెంబ్లీముట్టడిలో పాల్గొనేందుకు వెళ్తున్న మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. నాయకులు బడుగు రవి, సురేష్ పాల్గొన్నారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాలమహానాడు నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోగల కృష్ణయ్య, నాయకులు గుంపుల సుధాకర్‌లు ఉన్నారు.

జన్నారం, (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్ర కార్యదర్శి బెంజిమెన్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతును నొక్కడం సరికాదన్నారు. జక్కుల సురేష్,సంజీవ్, కర్ణాకర్ పాల్గొన్నారు.

కడెం ఆయకట్టు రైతుల సమస్య తీర్చాలి

జన్నారం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కడెం ఆయకట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు రాజారాంరెడ్డి అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాసంగి పంటపై స్పష్టత లేకపోవడంతో ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ప్రాజెక్టు అధికారులకు వినతిపత్రం అందించారన్నారు. కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక మాట్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వాలు నీటి విడుదలకు ముందు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసేవారని, ఈ యేడు నిర్వహించకపోవడంతో వ్యవసాయంపై అవగాహన ఉందా అని ప్రశ్నించారు. చిట్టిమల్ల భరత్‌కుమార్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, సుతారి వినయ్, జనార్దన్, ఫజల్‌ఖాన్, రాగుల శంకర్, కెవి నర్సింహులు, జాడి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన

మందమర్రిరూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ గ్రామంలో చెన్నూరు వ్యవసాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు విత్తుకునే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలని, అలా చేయడం వల్ల వివిధ రకాల బ్యాక్టీరియా తెగుళ్ల నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. రైతుకు పెట్టుబడి తగ్గి లాభాలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని, అప్పుడే అధిక లాభాలు వస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ముత్యం తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

- ముందుకు సాగని సమీకృత మార్కెట్ పనులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు
- పట్టణవాసులకు తప్పని ఇబ్బందులు



సమీకృత మార్కెట్ నిర్మించే స్థలం...

కాగజ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణ జనాభాకు కూరగాయాలు ఒకే చోట అందుబాటులో ఉండేందుకు నిర్మించాలని నిర్ణయించిన సమీకృత మార్కెట్ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. 2022లో రూ.7 కోట్లతో ప్రతిపాదనలు చేసి, పాలక వర్గం ఆమోదం చేసి పంపించారు. స్థల సేకరణ ప్రక్రియ చేసేందుకు పలు ప్రాంతాలను ఎంపిక చేశారు. బస్టాండు సమీపంలో ఉన్న ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌ను ఎంపిక చేశారు. ఈ గెస్ట్‌హౌస్ పురాతన భవనం కావడంతో కూల్చివేసి ఈ ప్రాంతంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేస్తే బాగుటుందని అధికారులు తేల్చారు.



ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ భవనం

- ప్రక్రియలో భాగంగా

ఈ ప్రక్రియలో భాగంగా మున్సిపల్ అధికారులకు ఈ భవనం తాలుకూ రికార్డులు అందజేశారు. ఈ మార్కెట్‌లో కూరగాయాలు విక్రయించేందుకు ప్రత్యేక గదులను, అలాగే మాంసాహారం అమ్మేందుకు మరికొన్ని గదులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. 2022లో చేపట్టిన టెండరుకు 2023లో అధిక ధరలు పెరుగడంతో రీ ఎస్టీమేట్లు చేసి మళ్లీ రూ.9.98 కోట్లతో టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. తాను వేరే ప్రాంతాల్లో చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని, టెండరు పొందిన కాంట్రాక్టర్ తాము పనులు చేయలేమని ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో పనులు నిలిచిపోయాయి. పట్టణంలో ఇందిరా మార్కెట్, సర్‌సిల్క్‌లో చిన్నమార్కెట్ ఉన్నాయి. సమీకృత మార్కెట్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యాంగా ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం సమీకృత మార్కెట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..

లెండుగురే శ్యాంరావు, కాగజ్‌నగర్



అధికారులు స్పందించి సమీకృత మార్కెట్ నిర్మాణానికి కృషి చేస్తే బాగుటుంది. కాగజ్‌నగర్‌లో రెండు మార్కెట్ ఉన్నాయి. పట్టణ జనాభాకు సరి పోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు త్వరిత గతిన చర్యలు తీసుకోవాలి.

పట్టణవాసులకు అనుకూంగా ఉంటుంది..

గుళ్లపల్లి ఆనంద్, కాగజ్‌నగర్



సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయితే పట్టణవాసులకు అనుకూలంగా ఉంటుంది. అధికారులు దృష్టి సారించి పనులు పూర్తి చేయాలి. ప్రస్తుతం ఇందిరా మార్కెట్, చిన్న మార్కెట్‌లో రద్దీ అధికంగా ఉంటుంది. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలి.

సంఘ విద్రోహశక్తులకు దూరంగా ఉండాలి



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

బెజ్జూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల యువత సంఘ విద్రోహశక్తులకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన నాగేపల్లిలో గురువారం పోలీసులు-మీకోసం కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు దుప్పట్లు, పేదలకు నిత్యావసర సామగ్రి, యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ఎల్లప్పుడూ ప్రజా సేవలో ఉంటారని చెప్పారు. ఏ చిన్న కష్టం వచ్చినా తమను సంప్రదిస్తే సమస్యకు పరిష్కారం కోసం కృషి చేస్తారని అన్నారు. మొగవెల్లి నుంచి గూడెం వరకు రోడ్డు మరమ్మతులకు కృషి చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. గిరిజనులు తమ పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని చెప్పారు. భవిష్యత్తులో తాము మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జిల్లాలో ఇటీవల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. చిన్న విషయాలకు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, సమస్య పరిరష్కారం కోసం కృషి చేసుకోవాలని కోరారు.

వైద్య శిబిరానికి స్పందన..

నాగేపల్లి గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. కాగజ్‌నగర్ విజేత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎస్పీ శ్రీనివాసరావు ప్రారంభించారు. మారుమూల గ్రామాల్లో పేద ప్రజలు వైద్యం కోసం దూరరప్రాంతాలకు వెళ్లకుండా ఉండేందుకు స్థానికంగా శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం రోగులకు మందులు అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ సూర్యకృష్ణ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ రమేష్, బెజ్జూరు ఎస్సై ప్రవీణ్‌కుమార్, మండల సర్‌మెడి కొడప శంకర్, మాజీ సర్పంచ్‌లు అనిల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

చింతలమానేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీల్లో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి కబడ్డీ ఆటలో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారులకు బాబాసాగర్ గ్రామానికి చెందిన దుర్గం శంకర్, నగపురె ప్రభాకర్ ఎస్వీ క్లినిక్ ఆధ్వర్యంలో గురువారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పణిందర్, క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు..

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన ప్రాంతాల ప్రజలకు గురువారం బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్‌యాదవ్‌లు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

చింతలమానేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు చేపట్టిన సర్వే గురువారం మండలంలోని కర్జెల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఇంగాని ఇస్తారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఇళ్ల సర్వే నిర్వహించడంలో ఇబ్బందులు తలెత్తాయి. లబ్ధిదారుల ఇంటి వద్ద సర్వేయర్లు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

పోస్టర్ల ఆవిష్కరణ

రెబ్బెన, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లిటరసి క్లౌడ్ పోస్టర్లను గురువారం రెబ్బెన కాంప్లెక్సు ప్రాథమిక పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విజయరాణి మాట్లాడుతూ పిల్లల్లో అభ్యసన ఫలితాలు పెంపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగయ్య, ఉపాధ్యాయురాలు కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి కె యువరాజా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు జైలులో అందుతున్న వసతులపై జైలు సూపరింటెండెంట్ ప్రేంకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు జిల్లా న్యాయసేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలను అందించను న్నామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ వాదులు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

కౌటాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని రైస్ మిల్ సమీపంలో విద్యుదాఘాతంతో గురువారం మేక మృతి చెందింది. మేత కోసం వెళ్లిన మేక కంచలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది



సమిష్టి కృషితో బొగ్గు నాణ్యత పెంపు

శ్రీరాంపూర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు అంకితభావం, సమిష్టి కృషితో పనిచేస్తేనే బొగ్గు నాణ్యత పెరుగుతుందని ఎస్ఓ టు జీఎం ఎన్ సత్యనారాయణ అన్నారు. ఎస్ఆర్‌పీ 1, ఎస్ఆర్‌పీ 3 గనులపై గురువారం మల్టి డిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీం-2 కన్వీనర్ కె. రాజేందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీ ఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఎస్ఈ(ఐఈడీ) కిరణ్ కుమార్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రివైజ్డ్ రిటర్న్స్ సమర్పించాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు రివైజ్డ్ రిటర్న్స్ సమర్పించాలని డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాన్ నంబర్ ఇన్‌ఆపరేటివ్‌గా ఉండి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయపు పన్ను శాఖ అపరాధ రుసుం రికవరీ కోసం ఏరియాలో 492 మంది ఉన్నారని, వీరంతా ఈ నెల 31వ తేదీలోగా తమ రివైజ్డ్-16 ఫారాలు గనులు, విభాగాల ద్వారా సమర్పించాలని సూచించారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాటు చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎస్వీ సూర్యనారాయణ అన్నారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను, వాకింగ్ ట్రాక్ పనులను ఆయన పరిశీలిం చారు. వేడుకలకు కావాల్సిన పనులను అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు తాగునీరు, ఇతర వసతులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, డీజీఎం (సివిల్) ఆనంద్‌కుమార్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సీనియర్ పీవో కాంతారావు, సివిల్ ఇంజనీర్ గుండేరావుపాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ సకాలంలో చెల్లించేలా చూడాలి

మందమర్రి టౌన్, డిసెంబర్ 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు సంబంధించిన పీఎఫ్, సీఎంపీఎఫ్ వారు మరణించినా, పదవీ విరమణ పొందినా సకాలంలో వచ్చేలా చూడాలని సీఎంపీఎఫ్ రిజనల్ కమిషనర్ 1 హరీపచౌరి అన్నా రు. గురువారం స్థానిక జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు కార్మికుల భవిష్య నిధితో పాటు ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. వీటికి ఎలాంటి ఆటంకాలు ఉన్నా తొలగించే విధంగా వారి పరిధిలోకి వస్తే పై అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. కార్మికులకు ఇవి ప్రధానమైనవని తెలిపారు. కార్యక్రమంలో సలేంద్ర సత్యనారాయణ, అక్బర్ ఆలీ, దాగం మల్లేష్, శ్యాసుందర్ తదితరులు పాల్గొన్నారు.

‘హామీలు నెరవేర్చేది ఎప్పుడు’

శ్రీరాంపూర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ప్రశ్నించారు. ఆర్‌కే 7 గనిపై గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హామీలను అమలు పర్చేందుకు కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, సమ్మయ్య, భగవాన్‌రెడ్డి, అనిల్, రాకేష్, రవీందర్, సత్యనా రాయణ, వేణు పాల్గొన్నారు.

కార్మికులకు ఉత్పత్తి పరికరాలు ఇవ్వాలి



కేకే 5 గనిపై సమస్యలు తెలుసుకుంటున్న ఐఎన్టీయూసీ నాయకులు

మందమర్రి టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బొగ్గు బావుల్లో పని చేస్తున్న కార్మికులకు ఉత్పత్తి పరికరాలను అందజేయాలని మందమర్రి ఏరియా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య అన్నారు. ఏరియాలోని కేకే 5 గనిపై గురువారం కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికులు హ్యాండ్ గ్లౌజ్‌లతో పాటు వామ్ కోట్స్ సరిపడా ఇవ్వడం లేదని, దీని వల్ల ఎలా విధులు నిర్వహిస్తారని వారు ప్రశ్నించారు. ఉత్పత్తికి ఉపయోగించే డ్రిల్ బిట్స్ సప్లయి కూడా లేకపోవడం ఏంటని ఆయన మండిపడ్డారు. పరికరాలు ఇస్తేనే అధిక ఉత్పత్తి సాధిస్తారని తెలిపారు. సమావేశంలో కేంద్ర కమిటీ చీఫ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్, జనరల్ సెక్రెటరీ మిట్ట సూర్యనారాయణ, నాయుకలు పానుగంటి వెంకటస్వామి, కల్పన, పిట్ కమిటీ సభ్యులు సదయ్య, హనుమాండ్ల రాజేంద్ర ప్రసాద్, కలమంద స్వామి, పవన్, రాజేందర్, రాజ్‌కుమార్, చంద్రమౌళి, రమేష్, సురేష్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఏరియా జీఎం ఎల్.వి. సూర్య నారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తమ వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు క్రిష్ణకాలనీలోని సివిల్ కార్యాలయం వద్ద ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ముఖ్య అతిథిగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం మాట్లా డుతూ, ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హా మీలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సమస్యలు పట్టించుకోలేదని, ఇప్పుడు కాంగ్రెస్ అదే దారిలో వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని ఈ నెల 19, 20, 21 తేదీల్లో నిరసనలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో కిరణ్, ఈశ్వర్, రాజయ్య, తిరుపతి, శ్రీనివాస్, గౌరమ్మ, బూదమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో శ్రీరాంపూర్ ఏరియా జట్టు విజయం



క్రికెట్ పోటీల్లో గెలిచిన శ్రీరాంపూర్ ఏరియా జట్టు

రెబ్బెన, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కంపెనీ స్థాయి క్రికెట్ పోటీల విజేతగా శ్రీరాంపూర్ ఏరియా జట్టు నిలిచింది. 91వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా గోలేటిలోని శ్రీ భీమన్న స్టేడియంలో కంపెనీ స్థాయి పోటీలు కొనసాగాయి. గురువారం నిర్వహించిన ఫైన ల్ పోటీల్లో ఆర్‌జీ1, ఆర్‌జీ2 జట్టుపై శ్రీరాంపూర్ జట్టు ఒక్క పరుగు తేడాతో గెలిచింది. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజనమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు ఎస్.తిరుపతి, ఎస్ఓ టూ జీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, ప్రాజెక్టు ఇంజనీర్ వీర న్న, పర్సనల్ మేనేజర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కామన్ మెనూపై స్పష్టత ఏదీ..?

5వ పేజీ తరువాయి

ఓ వైపు గురుకులాల సంఖ్యను పెంచిన ప్రభుత్వం చార్జీలు పెంచక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల శ్రేయ స్సు దృష్ట్యా 40 శాతం చార్జీలను పెంచింది. ఆ చార్జీలను ఈ నెల 14 నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. జిల్లాలో 8 బీసీ, 9 ఎస్సీ, 3 మైనార్టీ, 18 గిరిజన గురుకులాలు ఉన్నాయి. 12 బీసీ గురుకులాల్లో 1823 విద్యార్థులు, మూడు మైనార్టీల్లో 1214 మంది, తొమ్మిది ఎస్సీ గురుకులాల్లో 2380 మంది, గిరిజన గురుకులంలో 2680 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

పంపిణీ చేసేదెలా...?

ప్రభుత్వం చార్జీలు పెంచిన ప్రకారం వీక్లీ మెనూ ఇచ్చింది. అయితే మెనూకు సంబంధించి ఆయా ఆహార పదార్థాలు ఒక్కో విద్యార్థికి ఎన్ని గ్రాములు ఇవ్వాలనే అంశాన్ని సూచించలేదు. దానిపై స్పష్టత లేకుండా మెనూ అమలు కష్టసాధ్యం కానుంది. మరోవైపు సంక్షేమ వసతి గృహాల్లో చాలా చోట్ల నూతన మెనూకు అనుగుణమైన వంట పాత్రలు లేవు. చపాతి, పూరీ, ఇడ్లీ తదితర పదార్థాలు తయారు చేసేందుకు పరికరాలు లేవు. వసతి గృహాల్లో సరిపడా నాలుగో తరగతి సిబ్బంది లేరు. కొత్త మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండటానికి సిబ్బందికి శిక్షణతోపాటు వారి సంఖ్యను కూడా పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది

నైతం లక్ష్మన్, మంచిర్యాల పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ వార్డెన్

ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడం హర్షణీయం. విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయం వల్ల మేలైన పౌష్టికాహారం అందించేందుకు అవకాశం లభించింది. అయితే ఒక్కో విద్యార్థికి ఎన్ని గ్రాములు ఇవ్వాలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతో మెనూ అమలు కష్టసాధ్యంగా మారింది. ఆయా ఆహార పదార్థాలు ఎంత రేట్లలో కొనాలన్న విషయంలో కూడా స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వం గురుకులాల్లో గ్యాస్, ఇతర వస్తువులు టెండర్ ద్వారా సరఫరా చేస్తున్నట్లుగానే ఎస్టీ, ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు కూడా మెనూ ప్రకారం వస్తువులు సరఫరా చేయాలి.

కౌన్సిలర్ @ గ్యాస్ డెలివరీ బాయ్



మాటూరి మధు, 6వ వార్డు కౌన్సిలర్

బెల్లంపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వార్డు మెంబర్, సర్పంచ్ పదవి రాగానే వారి వేషధారణ మారుస్తున్నారు. కార్యకర్త నుంచి మొద లు ప్రజాప్రతినిధుల వరకు ఖద్దర్ దుస్తులు ధరిస్తున్నారు. మరికొందరైతే బైకులు, కార్లు మెయింటేన్ చేస్తూ హడావుడి చేస్తుంటారు. కానీ అందుకు భిన్నంగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన మాటూరి మధు కౌన్సిలర్‌గా గెలిచినా సాదాసీదా జీవితం గడుపుతూ ఇప్పటికీ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు.

కౌన్సిలర్ అయినా గ్యాస్ డెలివరీ చేస్తూ...

పట్టణంలోని ఆరో వార్డుకు(ఇంక్లైన్ రడగంబాలబస్తీ) చెందిన మాటూరి మధు 25 ఏండ్లుగా గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మున్సిపల్ ఎన్నికల్లో ఆరో వార్డు కౌన్సిలర్‌గా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి గెలుపొందాడు. ఇంటింటికి సిలిండర్‌లు సరఫరా చేస్తూ అందరితో కలుపుగోలుగా ఉండడం, ప్రతీ ఒక్కరిని వరుసలు పెట్టి ఆప్యాయంగా పిలవడం వంటి అంశాలు కలిసొచ్చాయి. కౌన్సిలర్‌గా గెలుపొంది ఐదేళ్ళ కాలం దగ్గర పడుతున్నప్పటికీ ద్విచక్ర వాహనంపై గ్యాస్ సిలిండర్‌లను ఇంటింటికి సరఫరా చేస్తున్నాడు. పట్టణంలో అందరికీ గ్యాస్ మధుగానే సుపరిచితుడు.



అన్నం పెట్టిన వృత్తిని మరువను...

25 ఏండ్లుగా పట్టణంలో గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తూ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నా. గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తూ ప్రతీ ఇంటిలో ఒకడిగా మెదిలి అందరి ఆప్యాయతతోనే విజయం సాధించాను. ఇప్పటికీ ప్రజలు గ్యాస్ మధుగానే గుర్తిస్తుండడం సంతోషాన్నిచ్చింది.

గూడెం ఆలయం హుండీల లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, పరిశీలిస్తున్న అధికారులు

దండేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం హుండీలను లెక్కించారు. 33 రోజులకుగాను రూ. 6,56,858 ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ తెలిపారు. స్వామి వారి ప్రధానాలయంలో హుండీని దేవాదాయ ధర్మదాయ శాఖ పర్యవేక్షకులు ఎం.రవి, ఆలయ ఈవో, వంశపారం పర్య అర్చకులు గోవర్ధన రఘస్వామి, పోలీసు సిబ్బంది సమక్షంలో హుండిని లెక్కించారు. వివిధ రసీదులు, టిక్కెట్ల ద్వారా, భక్తులు హుండీలో వేసి కానుకలతో కలిపి రూ.6,56,858 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సత్యనారాయణ, ప్రతాప్‌సింగ్, దిద్దుళ్ళ నారాయణశర్మ, జయస్వామి, అంజనేయ స్వామి, సంపత్‌స్వామి, సురేష్‌స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి



డీఈవో యాదయ్యకు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌టీయూటీఎస్ నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బాపులు పేర్కొన్నారు. గురువారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందించారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రపోజల్స్‌ను త్వరగా జిల్లా మెడికల్ బోర్డుకు పంపించాలన్నారు. చలి తీవ్రత ఎక్కువ ఉన్నందున పాఠశాలల సమయాన్ని ఉదయం 9.40 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మార్చాలని కోరారు. చారి, వెంకటేశ్వర్లు, శంకర్‌గౌడ్, పద్మ, మన్మోహన్, సత్యనారాయణ, సుమన్ పాల్గొన్నారు.

అధ్యయన కేంద్రంగా కవ్వాల్ అభయారణ్యం

● తరలివస్తున్న విద్యార్థులు, పర్యాటకులు ● పక్షులు, జంతువులు, వృక్షాలకు నిలయం కవ్వాల్ టైగర్ రిజర్వు

జన్నారం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల్ టైగర్ జోన్ అనగానే పచ్చని అడవి, జంతువులు, పక్షులు గుర్తుకు వస్తాయి. ఈ అడవిలోకి యేటా సీజన్‌వారీగా దేశ, విదేశీ పక్షులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడకు శీతాకాలంలో పక్షులు అధిక సంఖ్యలో వస్తుంటాయి. దీనికి తోడు పులులకు మేకింగ్ సమయం (పునరుత్పత్తి సమయం) కావడంతో పులుల సందడి ఉంటుంది. అటవీ శాఖ అధికారులు చేపడుతున్న అభివృద్ధి పనులతో వృక్షజాతులు పెరిగాయి. దీంతో ప్రకృతి ప్రేమికులతోపాటు దేశ విదేశాల నుంచి విద్యార్థులు, అటవీ కళాశాలల విద్యార్థులు, పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు. అడవిలో ఉండే వృక్షాలు వాటి జాతులు, వాటి లక్షణాలపై అధ్యయనం చేయడంతోపాటు జంతు ప్రేమికులు జంతువుల లక్షణాలు, వాటి జాతులపై అధ్యయనం చేస్తున్నారు.



అడవిలో పర్యటిస్తున్న జగిత్యాల విద్యార్థులు

కవ్వాల టైగర్ జోన్‌లో పక్షులు, జంతువులు, వృక్షాల జాతులు

కవ్వాల టైగర్ జోన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతంలో ముఖ్యంగా 68 రకాల క్షీరదాలు, 23 రకాల క్రిమీ కీటకాలు, 68 రకాల సరీసృపాలు, 10 రకాల కప్పలు ఉండగా 48 రకాల గడ్డి జాతులు ఉన్నాయి. అటవీ ప్రాంతంలో 673 రకాల వృక్షాలు ఉండడం వల్ల వీటిని అధ్యయనం ఆయా కళాశాలల నుంచి విద్యార్థులు వస్తున్నారు.

ఆహ్లాదం , అధ్యయనం

కవ్వాల టైగర్ రిజర్వును ఒక్కసారి అయినా చూడాలని విద్యార్థులు, పర్యాటకుల్లో ఆసక్తి ఏర్పడుతోంది. గతంలో హైద్రాబాద్, కరీంనగర్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చేవారు. గతేడాది నుంచి వివిధ రాష్ట్రాల నుంచి కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు కవ్వాల్ చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కవ్వాలకు వస్తే వన వృక్ష, జంతు, పక్షి జాతులపై అవగాహన వస్తుందని ఆసక్తి చూపుతున్నారు. గతంలో కంటే ప్రస్తుతం కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు కవ్వాల టైగర్ జోన్‌లో పర్యటిస్తున్నారు.

అధ్యయనానికి వీలుగా - సుష్మారావు, ఎఫ్ఆర్‌వో , తాళ్లపేట,జన్నారం



అధ్యయనానికి , ఆహ్లాదానికి కవ్వాల అభయారణ్యం ఎంతో అనువైంది. పలు రకాల జంతువులు, పక్షులు, వృక్షాలు ఉన్నాయి. రోజు ఎంతో మంది పర్యాటకులు రావడం తోపాటు దేశ విదేశాల నుంచి విద్యార్థులు అడవిని చూసేందుకు వస్తున్నారు. వారికి దగ్గరుండి వారికి అన్ని విషయాలను తెలియజేస్తున్నాం. ముందస్తుగా సమాచారం అందించి వస్తే వారి అధ్యాయనికి అందుబాటులో ఉంటాం.

ఆతిథ్యం అదిరింది

దేశ, విదేశాలు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి అటవీ శాఖ, ఏకో టూరిజం ఆధ్వర్యంలో హరిత రిసార్టులో బస చేస్తారు. ఉదయం వారిని సఫారీల ద్వారా అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లి వృక్ష జాతులు, వాటి రకాలు, గడ్డి జాతుల రకాలను వివరిస్తున్నారు. మాంసాహార, శాఖహార జంతువులు, సరిసర్పాలు, అతిథి పక్షులు, వాటి లక్షణాలు తెలపడం, ఆహార పద్ధతులు వివరిస్తున్నారు.



సఫారీ ద్వారా అడవిలోకి వెళ్తున్న విద్యార్థులు





బైసన్ కుంట వద్ద విద్యార్థులు

ఇంటర్వ్యూ

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా - శ్రీనివాస్, ఏఈ



ఆంధ్రజ్యోతి: పట్టణంలో ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి?

ఏఈ: గృహాల విద్యుత్ కనెక్షన్లు 26,655, వ్యవసాయ కనెక్షన్లు 485 ఉన్నాయి. పట్టణంలో రెండు సబ్‌స్టేషన్లలో ఐదు ఫీడర్లు, ఒక ఎక్స్‌ప్రెస్ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది.

ఆంధ్రజ్యోతి: గృహజ్యోతి పథకం ద్వారా ఎంతమందికి లబ్ధి చేకూరుతోంది.

ఏఈ: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహ జ్యోతి పథకం (జీరో- బిల్లు) నస్పూర్ పట్టణంలో 6961 మంది వినియోగదారులు సద్వినియోగం చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి: కొన్ని చోట్ల ప్రమాదకరంగా వైర్లు వేలాడుతున్నాయి?

ఏఈ: వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పునకు సర్వే చేస్తున్నాం. వేలాడుతున్న వైర్ల మధ్య మిడిల్ పోల్స్ వేశాం. ఇంకా ఎక్కడైనా ఉంటే మార్చుతాం.

ఆంధ్రజ్యోతి: ఇళ్లపై ఉన్న 11 కేవి లైన్ల షిఫ్టింగ్ ఎప్పుడు?

ఏఈ: తీగల్‌పహాడ్ ఏరియాలో ఇళ్లపై నుంచి వెళ్లిన 11 కేవి విద్యుత్ లైన్ ఒక చోట మార్చాం. మరొక దానికి ఎస్టిమేంట్ వేయించి తొందరగానే మార్చే ప్రయత్నం చేస్తాం. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాను అందించమే లక్ష్యం.

- నస్పూర్, (ఆంధ్రజ్యోతి)

పేదలకు రగ్గులు పంపిణీ

గర్మిళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : హెడ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం పేద ప్రజలకు రగ్గులను పంపిణీ చేశారు. ఏఎస్ఐ సత్తయ్య హాజరై పేదలకు రగ్గులు అందజేశారు. సొసైటీ ఫౌండర్ సైమన్, కళ్యాణ్, ప్రసాద్, శ్రీనివాస్, రాగమాలిక తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి



జైపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం వెంకట్రావుపల్లి, జైపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అందిస్తోందన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల వివరాలను ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. పారిశుధ్యం నిర్వహణలో పకడ్బందీగా చేపట్టాలని, రోజు తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించాలన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): నీలాయిపల్లిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీవో అనిల్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే కోసం వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని సూచించారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపునకు ఎంపీడీవో జేఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యదర్శులు సర్వే చేపట్టారు. లబ్ధిదారుల ఫొటో, భూమిపత్రాల కోసం ఇంటింటా సర్వేతో పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. నెలాఖరులోగా సర్వేను పూర్తి చేయాలని కార్యదర్శులకు సూచించారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి, సారంగపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. 4, 20, 29 వార్డుల్లో సర్వేను పరిశీలించారు. అర్హుల వివరాలను పొరపాట్లు లేకుండా పొందుపర్చాలన్నారు. కౌన్సిలర్లు షేక్‌అస్మా, రమేష్ పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్లను ఎంపీవో సతీష్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణమూర్తి, అధికారులు పరిశీలించారు. 1742 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకోగా 305 మంది దరఖాస్తుదారుల ఇండ్లను పరిశీలించామని పేర్కొన్నారు. ఎంపీవో పల్లె ప్రకృతివనాన్ని సందర్శించి మొక్కలను సంరక్షించాలన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి



మంచిర్యాలలో కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో పదే పదే రాజ్యాంగాన్ని అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని దళిత బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐబీ చౌరస్తాలో గురువారం కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జూపాక సుదీర్, దుర్గం సిద్దార్థ, రామ్మూర్తి, మోహన్, దశరథం, రంజిత్‌కుమార్, కిష్టయ్య, పోశం, మధు, శ్రీనివాస్, కనకరాజు, మధుకర్, లింగమూర్తి, పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. అమిత్ షా దిష్టిబొమ్మను మంచిర్యాల బస్టాండ్ ఎదుట దహనం చేశారు. జయరావు, రంజిత్ కుమార్, శ్రీనివాస్, కాసిపేట రాజేశం, అంబాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలంగాణ విద్యార్థి ఉద్యమవేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐటీఐ కళాశాల ఆవరణలో మాట్లాడుతూ అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు బాలాజీ , గణేష్, రాజు, సంతోష్, పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌ను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు చిలుక రాజనర్సు అన్నారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద అమిత్‌షా దిష్టి బొమ్మను దహనం చేసి మాట్లాడారు. పార్లమెంట్‌లో అమిత్‌షా ఉద్దేశపూర్వకంగా అంబేద్కర్‌పై వ్యాఖ్యలు చేశాడని, క్షమాపణ చెప్పాలన్నారు. రమేష్, రాజం, రాజ్‌కుమార్, రమేష్, శివాజీ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేష్‌లు అన్నారు. ఎంసీపీఐయూ కార్యాలయంలో మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశంలో అమిత్‌షా మాటిమాటికి అంబేద్కర్ అంటూ వ్యాఖ్యానించడం బాధాకరమని పేర్కొన్నారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఢిల్లీలో అమిత్‌షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ రాహుల్ గాంధీ సహచర ఎంపీలతో కలిసి చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం లేకుండా చేసే కుట్రలో భాగమే ఈ వ్యాఖ్యలని పేర్కొన్నారు. అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అనుచిత వ్యాఖ్యలు అహంకారపూరితమైనవని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మండిపడ్డారు. హైదరా బాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మందమర్రిలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నాయకులు రాంబాబు, గజెల్లి లక్ష్మణ్, దాసరి రాజనర్సులు మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలు దళితజాతిని అవమానించడమేనన్నారు. రామన్న, వీరస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): అమిత్ షా అంబేద్క ర్‌ను కించపరుస్తూ మాట్లాడడాన్ని నిరసిస్తూ దళిత సంఘాల నాయ కులు కాసిపేటలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషే కం చేశారు. వెంటనే అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకటేష్, దుర్గం లక్ష్మీనారాయణ, పోశం, శంకర్ పాల్గొన్నారు.



ఢిల్లీలో జరిగిన ర్యాలీలో రాహుల్‌గాంధీతో పాల్గొన్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. దాగం మల్లేష్, లంక లక్ష్మణ్, అగ్గి సత్తి, అక్కెపల్లి బుగ్గరాజు, పాల్గొన్నారు.

జన్నారం, (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు చిట్టిమల్ల భరత్‌కుమార్ అన్నారు. ఇందయ్య, ప్రభుదాస్, రమేష్, గంగాధర్ పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రైస్‌మిల్లర్లు లక్ష్యాన్ని పూర్తిచేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కోటాను దక్కించుకున్న రైసుమిల్లర్లు యాభై శాతం లక్ష్యాన్ని ఈనెల 21లోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ అన్నారు. లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని రైసుమిల్లర్లు 63 వేల 144 మెట్రిక్ టన్నుల ధాన్యానికి వేలం పాడారని తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు 16 శాతంతో 10 వేల 268 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అందించారని, ఇంకా 52 వేల 876 మెట్రిక్ టన్నుల ధాన్యం అందించాల్సి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 103 కోట్ల రూపాయల విలువ గల ధాన్యం బకాయిలు ఉన్నాయన్నారు. 23 మంది రైస్ మిల్లర్లు లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఈ నెల 21లోగా లక్ష్యం, నగదు ఇవ్వని పక్షంలో మిల్లర్లతోపాటు పూచీకత్తు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగులు స్థానికంగా ఉండాలి

కాసిపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంత ఉద్యోగులు స్థానికంగా ఉండి ప్రజలకు సేవలందించాలని కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌బాబు అన్నారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ఏజెన్సీ ప్రాంతంలో పని చేసే ఉద్యోగి అలవెన్సులు పొందుతున్నారన్నారు. సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తూ ఉదయం 11 గంటలకు ఆఫీసుకు వచ్చి మధ్యాహ్నం మూడు గంటలకే వెళ్తున్నారన్నారు. అలాగే గ్రామ పంచాయతీలో ప్రైవేటు వ్యక్తుల పేరు మీద కరెంటు మీటరు కొనసాగుతుందని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటు హక్కును తొలగించేందుకు కుట్ర


ధర్మారావుపేట పంచాయతీ నుంచి ఓటు హక్కును తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారని నాయకుడు జాదవ్ గజానంద్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ధర్మారావుపేటలో 2-166-1 గల ఇంటి నంబరులో ఉంటున్నానని, ఓటు హక్కును తొలగించేందుకు ఒకరు కుట్రలు పన్నుతున్నారని, న్యాయం చేయాలని కోరారు.



త్వరలో కొత్త రేషన్ కార్డులు..

- ఎలక్ట్రానిక్ చిప్‌లు ఏర్పాటు చేసి అందజేస్తామని మంత్రి వెల్లడి
- ఏళ్లతరబడి ప్రజల నిరీక్షణ
- జిల్లాలో సుమారు 13వేల దరఖాస్తులు





చింతలమానేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డులు జారీ చేసేందుక ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి మంత్రిఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇటీవల ఈ సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారు. సుమారు ఆరున్నరేళ్లుగా ఎదురు చూస్తున్న దరఖాస్తుదారుల నిరీక్షణకు మోక్షం కలుగనున్నది. గతంలో వేసిన కేబినెట్ సబ్ కమిటీ సూచనలతో పాటు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల సలహాల మేరకు రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఉంటుందని మంత్రి ప్రకటించారు. కాగా కలెక్టర్లకు ఆదేశాలు రావాల్సి ఉన్నది.

● గత ప్రభుత్వ హయాంలో..

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల కోసం 13,265 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు ఆ సంఖ్య రెట్టింపుగా ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో 1,37,284 కార్డులు ఉన్నాయి. ఇందులో అంత్యోదయ 12,948, తెల్ల రేషన్‌కార్డులు 1,24,336 ఉండగా వీటికి నెలనెలా రేషన్ దుకాణాల ద్వారా 2,968 టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇంకా కొత్త ప్రభుత్వంలో ప్రజా పాలన ద్వారా వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నా వాటికి సంక్రాంతి లోపు ముహూర్తం కలిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

● రేషన్‌కార్డే ప్రామాణికం..

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు పొందాలంటే లబ్ధిదారులకు రేషన్ కార్డు తప్పనిసరిగా మారింది. గత ఆరున్నరేళ్లుగా కొత్త రేషన్‌కార్డుల మంజూరు లేక పోవ డంతో చాలా మంది అర్హులైన వారు నిరాశకు గుర య్యారు. ఇప్పటికే చాలా మందికి పెళ్లిళ్లు అయ్యి పిల్లలు పెద్దవాళ్లు అయ్యి పాఠశాలలకు వెళ్తున్నారు. రేషన్‌కార్డులు లేక పోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకా లకు దూరమవు తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తెల్లరేషన్ కార్డుతో లింకు పెడు తున్నారు. ఆరున్నరేళ్లుగా కొత్త కార్డుల జారీ ప్రక్రియ లేకుండా పోయింది. కొందరికి ఉన్నా పిల్లల పేర్లు నమోదు చేసుకునే అవకాశం లేక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి రుణమాఫీ చేయడంలో సైతం రేషన్‌కార్డులు లేని వారు ఇబ్బంది పడ్డారు. ఒక్కటే రేషన్ కార్డులో తల్లి దండ్రులు, వారి పిల్లలు, ఉన్నారు. వారికి వివాహం జరిగిన ఏళ్లు గడిచి పిల్లలున్నా వారికి రేషన్ కార్డులు ఇవ్వలేదు. దీంతో ఒక్కటే కుటుంబంలో రూ. 2లక్షలకు పైగా రుణం ఉంటే ఎవ్వరికీ మాఫీ కాలేదు. దీంతో పెళ్లిల్లు అయ్యి, వేరే కాపురాలు పెట్టుకున్న వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసుంటే వారందరికీ రుణ మాఫీ అయ్యే అవకాశం ఉండేది. జిల్లాలోని చాలా మంది కుటుంబాలు ప్రభుత్వం అందజేసిన పథకంతో నష్టపోయారు. కాగా పేద కటుంబాల్లోనూ తెల్ల రేషన్ కార్డు లేని వారు బియ్యం అందక అవస్థలు పడుతున్నారు. అలాంటి వారికి ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే బియ్యం అందడం లేదు.

● స్మార్ట్ కార్డుల రూపంలో..

రేషన్ కార్డులను స్మార్ట్‌కార్డుల రూపంలో జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. కార్డుల జారీకి కేబినెట్ సబ్‌కమిటీ వేశామన్న మంత్రి అర్హులకు ఇప్పుడిచ్చే పోర్టిఫైడ్‌తో పాటు సన్నబియ్యం అందజేస్తామని చెప్పారు. రేషన్ కార్డులను పాత పద్ధతిలో కాకుండా ఎలక్ట్రానిక్ చిప్‌లు ఏర్పాటు చేసి అందజేస్తామని మంత్రి వెల్లడించారు. రేషన్ కావాల్సిన వారికి స్మార్ట్ రేషన్ కార్డులు, రేషన్ తీసుకోని వారికి స్మార్ట్ హెల్త్ కార్డుల రూపంలో మం జూరు చేస్తారు. ఎలక్ట్రానిక్ చిప్‌తో కూడిన స్మార్ట్ కార్డు అందిస్తామని మంత్రి ప్రకటించిన నేపథ్యంలో ఇందుకు సంబంధించి నియమ నిబంధనలు విడుదల కాగానే.. తిరిగి మళ్లీ దరఖాస్తుల స్వీకరణకు మరో సారి అవకాశం ఇస్తారా.. లేక ప్రజా పాలన దరఖా స్తులనే పరిగణలోకి తీసుకుంటారా అన్నది తెలియాల్సి ఉన్నది.

● ఆరేళ్ల క్రితం నిలిచిన ప్రక్రియ..

గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో 2019 జూన్ 30న తెల్లరేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిపి వేసింది. 2020లో రాష్ట్ర వ్యాప్తంగా కొంత మందికి ఇచ్చినట్టే ఇచ్చి ఫ్రీజింగ్ విధించింది. దీంతో నాటి నుంచి నేటి వరకు కొత్తగా వివాహం చేసుకున్న దంపతులు, ఉమ్మడి కుటుంబం నుంచి విడిగా ఉన్నవారు కొత్త రేషన్‌కార్డు కోసం ఎదురు చూస్తున్నారు. కాగా వీరిలో అప్పటికే తెల్లరేషన్ కార్డు ఉన్నప్పటికీ పిల్లలు పుట్టిన తర్వాత వారిని నమోదు చేసుకునే అవకాశం కల్పిం చలేదు. ఆధార్, అడ్రస్, ఫోన్‌నంబర్ సరి చేసుకునేం దుకు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మ్యుటేషన్, మెంబర్, ఆడిషన్ కొత్తకార్డుల కోసం వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్న వారు నిరీక్షిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలకు దూరం..



రేషన్‌కార్డుల మంజూరు లేక పోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నాం. మాకు వివాహం జరిగి ఇద్దరు పిల్లలున్నా ఇప్పటి వరకు రేషన్ కార్డు లేదు. ప్రభుత్వం వెంటనే అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలి.

- నగపురె ప్రభాకర్, బాబాసాగర్

ఏళ్ల తరబడి మంజూరు లేక..



రాష్ట్ర ప్రభుత్వం కొత్తరేషన్ కార్డులు మంజూరు చే యక ఏళ్లు గడుస్తున్నాయి. ఇటీవల మంత్రి అసెంబ్లీలో కొత్త రేషన్‌కార్డులపై ప్రకటన చేశారు. సంక్రాంతి లోపు రేషన్ కార్డులు ఇస్తే బాగుంటుంది. దీంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తే ఉపయోగకరం.

- బిష్ణు భిశ్వాస్, రవీంద్రనగర్

ఇంటర్వ్యూ

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

● భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి



ఆసిఫాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు ఏంటీ.?

డీపీవో : ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేశాం. జిల్లా వ్యాప్తంగా 2,874 పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. జిల్లాకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను సైతం అందు బాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎన్ని వార్డులను గుర్తించారు.?

డీపీవో : కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 335 గ్రామ పంచాయతీలలో 2,874 వార్డులను గుర్తించాం. ఆసిఫాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 1,616, కాగజ్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 1,258 వార్డులను గుర్తించాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు.?

డీపీవో : కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 3,51,194 మంది ఓటర్లు ఉన్నారు. 1,75,571 మంది పురుషులు, 1,75,605 మంది మహిళలు, 18 మంది ఇతరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎన్ని విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు?

డీపీవో : గతంలో జిల్లాలో మూడు విడతలుగా పంచాయతీలు ఎన్ని కలు నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి అందే ఆదేశాల మేరకు తగిన ఏర్పాట్లు చేస్తాం.

పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోడు వ్యవసాయం చేస్తున్న రైతులను అటవీ శాఖ అధికారులను ఇంకా వేధిస్తున్నారని, ప్రభుత్వం సమస్య పరిష్కరించాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. అసెంబ్లీలో గురువారం పోడు రైతుల సమస్యలపై హరీష్ బాబు మాట్లాడారు. తన తల్లి పాల్వాయి రాజ్యలక్ష్మి ఎమ్మెల్యేగా ఉన్న హాయంతో పోడు రైతులకు భూములను ఇవ్వగా గత ప్రభుత్వం హాయంలో మొక్కలు పెట్టేందుకు ప్రయత్నాలు చేసినట్లు చెప్పారు. రెండేళ్ల క్రితం తాను పోడుపై పోరాటం చేయగా తనపై రెండు పోలీస్‌స్టేషన్‌లో నాన్ బెయిల్ కేసులు పెట్టారన్నారు. తనతో పాటు 60 మంది రైతులపై కూడా కేసులు పెట్టి జైలుకు పంపించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులకు అభినందన

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని మైనారిటీ బాలుర-1 గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడంతో గురువారం పలువురు అభినందించారు. గత 18, 19 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో పాఠశాలకు చెందిన షేక్ షాదుల్, సాయి ప్రణీత్ ఫుట్‌బాల్‌లో స్వర్ణం సాధించారు. మురళి లాంగ్ జంప్‌లో కాంస్యం, విష్ణు 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్యం, మహేష్ 1500 మీటర్ల రన్నింగ్‌లో రజత పతకం సాధించారు. వీరిలో షాదుల్, మురళి, విష్ణు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీఈటి రాజశేఖర్ తెలిపారు. హ్యాండ్ బా ల్ పోటీల రాష్ట్ర స్థాయి జట్టుకు ఆరుగురు విద్యార్థులు పాఠశాల నుంచి ఎంపిక య్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రోమి ప్రతిభ, పీఈటి రాజశేఖర్ పాల్గొన్నారు.

చదరంగంలో రాణించడం అభినందనీయం

రెబ్బెన, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా స్థాయి సీఎం కప్ చదరంగం పోటీల్లో సింగరేణి కార్మికుల పిల్లలు రాణించడం అభినందనీయమని ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సీఎం కప్ చందరంగం పోటీలకు ఎంపికైన సింగరేణి కార్మికుల పిల్లలు అవినాష్, భవన రుషిని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్ సంపత్ కుమార్, ప్రాజెక్టు అధికారి .నరేందర్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, పర్సనల్ మేనేజర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పదో రోజుకు చేరిన ఎస్‌ఎస్‌ఏల సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధికరించాలని కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె గురువారం నాటికి పదో రోజుకు చేరుకుంది. ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, తెలంగాణ పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్యాంసుందర్, జైనూరు ఎంఈవో జాదవ్ మధుకర్ తదితరులు దీక్ష శిబిరాన్ని సందర్శించారు.

కళాకారుల పాత్ర అభినందనీయం

ఆసిఫాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లెందుకు నిర్వహించిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పోషించిన పాత్ర అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ వెన్నెల అన్నారు. గురువారం హైదరాబాద్ సారధి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల వేళలు మార్పు

ఆసిఫాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నెలకొన్న వాతావరణం, విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా శుక్రవారం నుంచి పాఠశాలల సమయంలో మార్పు చేసినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు కొనసాగుతున్నాయని తెలిపారు. శుక్రవారం నుంచి ఉదయం 9:40 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు కొనసాగుతాయని తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఇదే సమయం కొనసాగుతుందని తెలిపారు.

పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

రెబ్బెన, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డీఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయరాణి, మేడి చరణ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు

వాంకిడి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగుపడతాయని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. వాంకిడి మండలంలోని చౌపన్‌గుడ గ్రామంలో గంగారాజ్ భీమన్న దేవర జాతర సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్టుకు గురువారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఎస్సై ప్రశాంత్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్నులే నారాయణ, దుర్గం ప్రశాంత్, దాదాజీ, అనీల్, చరణ్, నిర్వహణ కమిటీ సభ్యులు రామ్‌బాయి, మెంగురావు, లచ్చు, చిన్నూ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఎం కప్ పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. గురువారం బాలురకు కబడ్డీ, ఖోఖో బాలికలకు హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ మొదలగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డీవైఎస్‌వో రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆసిఫాబాద్ జిల్లాలోని 15 మండలాలు, 2 మున్సిపాలిటీల నుంచి 700 మంది క్రీడాకారులు, 60 మంది వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏటీడీఓ చిరంజీవి, హెచ్‌ఎం జంగు, పేట కార్యదర్శి కృష్ణమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటేష్, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, రవి పాల్గొన్నారు.

వల్లభనేని కన్‌స్ట్రక్షన్ సేవలు భేష్

కౌటాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన సౌకర్యాలు కల్పిస్తున్న వల్లభనేని కన్‌స్ట్రక్షన్ సేవలు అభినందనీయమని కౌటాల తహసీల్దార్ పుష్పలత అన్నారు. మండలంలోని ముత్తంపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో వల్లభనేని కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల అభివృద్ధి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, ఎస్సై మధూకర్, ఎంఈఓ హన్మంతు, వల్లభనేని కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులు రవి, సతీష్, అంజన్న, శంకర్, గ్రామపెద్దలు శ్రీనివాస్, సత్యనారాయణ, బందురావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాథమిక పాఠశాలలల ఉపాధ్యాయులు విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీడీ రమాదేవి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీఎమ్మార్సీలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎస్సీఆర్టీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవోలు చిరంజీవి, ఖమర్ హుస్సేన్, శ్రీనివాస్, ఎస్సీఆర్టీలు పాల్గొన్నారు.

ధర్నాలో సీఆర్టీలు.. విద్యార్థులకు సాగని చదువులు


పాఠశాలకు వేసిఉన్న తాళం

చింతలమానే పల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న సీఆర్టీలు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఊట్నూర్‌లోని ఐటీడీఏ వద్ద నాలుగు రోజులుగా ధర్నా చేస్తున్నారు. చింతలమానేపల్లి మండలం కర్జెల్లి టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో ఒక్కరే సీఆర్టీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ధర్నాకు వెళ్తుండడంతో పాఠశాలకు తాళం వేసి ఉంటుంది. ఇక్కడ సుమారుగా 40 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నిత్యం పాఠశాలకు వచ్చి తాళం వేసి ఉండడంతో ఇళ్లకు వెళుతున్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన


వాంకిడిలో రాస్తారోకో చేస్తున్న దళిత సంఘం నాయకులు

వాంకిడి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. రాస్తారోకో కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్‌పి జిల్లా అధ్యక్షుడు మహోల్కార్ అశోక్, వాంకిడి మండల అధ్యక్షుడు జైరాం ఉప్రె, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: గురువారం జిల్లా కేంద్రంలో కేవీపీఎస్, డీవైఎఫ్‌ఐ నాయకులు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, కార్తీక్, టీకానంద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..:

కాగజ్‌నగర్: పట్టణంలో వివిధ దళిత సంఘాలు, ఆయా స్వచ్ఛంద సంస్థలు, ఆయా పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

బెజ్జూరు: బెజ్జూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్, హకీం, రామకృష్ణ, హన్మంతు, విష్ణు, దాసు పాల్గొన్నారు.

సిర్పూరు(టి): మండల కేంద్రంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలో గురవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బౌద్ధ సమాజ్ అధ్యక్షుడు బసార్కార్ విశ్వనాథ్, సమత సైనికల్ జిల్లా అధ్యక్షుడు జాడి దిలీప్, దళిత సంఘాల నాయకులు దేవాజీ, బందురావు, హేమాజీ, పాపయ్య, జానకీ రావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట: మండల కేంద్రంలో గురువారం అంబేద్కర్ సంఘం నాయకులు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు లహన్‌రాజ్, రాంచందర్, ఆశన్న, భీమయ్య, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


సిర్పూరు(టి)లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పడిపోతున్న ఉష్ణోగ్రతలు


ఆసిఫాబాద్‌లో మంట కాగుతున్న ప్రజలు


చింతలమానేపల్లిలో ప్రధాన రోడ్డుపై అలుముకున్న పొగమంచు

ఆసిఫాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో చలికి ప్రజలు వణికిపోతున్నారు. జిల్లాలోని సిర్పూర్ (యు) మండలంలో గురువారం 7.3 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిర్యాణిలో 8.2, కెరమెరిలో 9.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

చింతలమానేపల్లి: ఏజెన్సీ గ్రామాల్లో చలి పంజా విసురుతోంది. చలి తీవ్రత అధికంగా ఉండడంతో మండల ప్రజలు వణికిపోతున్నారు. చింతలమానేపల్లి మండలంలో రహదారులు, పంట పొలాలు పొగమంచు కమ్ముకుంటోంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు.

మంచిర్యాల: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాల్‌పూర్‌లో గురువారం 11.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో 11.9 డిగ్రీలు, దండేపల్లి మండలం లింగాపూర్‌లో 12.1 డిగ్రీలు, మండలంలోని వెల్గనూరులో 13.0 డిగ్రీలు, హాజీపూర్ మండలంలో 13.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా శ్రీ కటకం కృష్ణవేణి, భర్త : తుపాకుల శివరామకృష్ణ వృత్తి : వ్యాపారం, నివాసం : ఇ.నెం. 1-105, బెండార, వాంకిడి, మండలము వాంకిడి, జిల్లా : కొమురంభీం ఆసిఫాబాద్. రిజిస్ట్రేషన్ జిల్లా ఆదిలాబాద్, సబ్ జిల్లా ఆసిఫాబాద్, జిల్లా పరిషత్ మరియు జిల్లా కుమురంభీం ఆసిఫాబాద్, రెవెన్యూ మండలము వాంకిడి, గ్రామ పంచాయతీ మరియు గ్రామము బెండార, కోడ్ నెం. 104, గ్రామపు ఇంటి నివాస స్థల సర్వే నెం. 12/1/1/1 లోని ఖాళీ స్థలం విస్తీర్ణము 40-0x50-0 = 2,000 చ.అడుగులు సమానము 222.22 చ.గజములు లేదా 185.80 చ.మీటర్లు అగును. దీనికి గల పూర్తి హద్దులు తూర్పు : నేషనల్ హైవే 363 రోడ్, పడమర : సోదరి సంతోష్ గారి ఇల్లు, ఉత్తరం : వడాయి నారాయణ గారి ఇల్లు, దక్షిణం : ఆడె మొండి గారి భూమి.
పై స్థిరాస్తికి కటకం కృష్ణవేణి, భర్త : శివరామకృష్ణ గారు పూర్తి హక్కుదారులు గా ఉండి నా క్లైయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్: కాగజ్‌నగర్ నందు తనఖ పెట్టుచున్నారు.పై స్థిరాస్తికి ఎవరికైనా ఎలాంటి అక్షేపణలు అభ్యంతరాలు ఉన్న యెడల ఈ ప్రకటన తేది నుండి (7) రోజులలో పూర్తి సాక్ష్యాదారాలతో సంప్రదించగలరు.
ఇట్లు సం/- పిన్నింటి అశోక్, అడ్వకేట్
3-7-852/1, వావిలాలపల్లి, కరీంనగర్.
సెల్ : 9849331558

స్వేరోస్ ఆధ్వర్యంలో ర్యాలీ


కాగజ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న స్వేరోలు

కాగజ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం స్వేరోస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని పలు వీధుల గుండా సాగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్వేరో సుప్రీం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సిర్పూరు నియోజకవర్గంలోని డిగ్రీ చదువుతున్న మొదటి సంవత్సరం విద్యార్థినులకు సంతూర్ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లెండుగురే శ్యాంరావుతో పాటు నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అంబేద్కర్‌ను అవమానించడం దారుణం'

కాగజ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్‌షా అవమానించడం దారుణమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు.

సదా మీ సేవలో ఆంధ్రజ్యోతి
అ చిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి
చందాదారులు గా చేరాలనుకుంటున్నారా!
అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితె చాలు
మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు.
పత్రిక పంపిణిలో మీకు ఏమైనా అసౌకర్యం
ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు
మా సిబ్బంది సదా మీ సేవకు సిద్దంగా ఉంటారు
మంచిర్యాల : 94929 68431
బెల్లంపల్లి : 77806 58811
కుమ్రంభీం ఆసిఫాబాద్ : 84639 54674
C.O : 99854 11276
ఇట్లు : బ్రాంచ్ మేనేజర్